అక్షర దర్బార్
www.aksharadarbar.com
voice of the people
వెల ₹5
శనివారం 28, డిసెంబర్ 2024 | సంపుటి :02 | సంచిక :276 | పేజీలు :07

జైలుకెళ్లినా బుద్ధి మారలె..

- చోరీ కేసులో నిందితుడి అరెస్ట్
- 13 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం

07

సమస్యల పరిష్కారానికి కృషి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
- రాజీవ్ స్వగృహ, ఇందిరమ్మ కాలనీల సందర్శన

05

- ఆర్థిక సంస్కర్తకు కన్నీటి వీడ్కోలు
- ప్రభుత్వ లాంఛనాలతో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్ హాజరు
- తుది వీడ్కోలు పలికిన కాంగ్రెస్ అగ్రనేతలు
- భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించిన మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీ

07

ఇక సెలవు

- తాజాగా ఏసీబీ వలలో ఇద్దరు అధికారులు
- రూ. 6వేలు తీసుకుంటూ పట్టుబడిన శంకరపట్నం డీటీ
- రూ. 50 వేలు పుచ్చుకుంటూ అడ్డంగా బుక్కైన దమ్మ పేట రెవెన్యూ సర్వేయర్

అవినీతి తిమింగలాలు

ప్రతి పనికీ రేట్ ఫిక్స్ చేసి మరీ వసూళ్లు

వరుసగా దాడులు జరుగుతున్నా మారని తీరు

వరుసగా ఏసీబీ దాడులు జరుగుతున్నా పలు శాఖల్లోని అధికారుల తీరులో మాత్రం మార్పు రావడంలేదు. కొందరు ఆఫీసర్లు లంచమిస్తేనే పని చేస్తున్నారు. ప్రతి పనికీ ఇంత అని ఫిక్స్ చేసి మరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ భూరికార్డులు, వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ శాఖల్లో ఎంతో కొంత ముట్టజెప్పనిదే పనులు జరగని పరిస్థితి నెలకొన్నది. ఈక్రమంలోనే శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట రెవెన్యూ సర్వేయర్, కరీంనగర్ జిల్లా శంకరపట్నం డిప్యూటీ తహసీల్దార్ లంచంతీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కడం కలకలంరేపింది. మరోవైపు లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని, అవినీతికి పాల్పడితే కటకటాలు తప్పవని, ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఫోన్ నంబర్ 94404 46140 ను సంప్రదించాలని అవినీతి నిరోధకశాఖ అధికారులు సూచిస్తున్నారు.- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

05

అనుకున్నా సాధించా



- నాన్నను ఒప్పించి, మెప్పించా..
- ప్రాతినిధ్యం లేని కులానికి నాయకత్వం వహించా..
- రాజ్యాధికారానికి దూరంగా ఉన్న కమ్యూనిటీ నుంచి లీడర్‌గా ఎదిగిన

"కుల బలంలేదు. ధన బలంలేదు, సామాజికంగా రాజకీయ నేపథ్యం అంతకన్నాలేదు. ఇలాంటి పూర్తి ప్రతికూలతల్లోనే పాలిటిక్స్‌లో అడుగుపెట్టిన. ఓపక్క మనకు రాజకీయాలొద్దు బిడ్డా అని వారించిన నాన్న, మరోపక్క నిత్యం వెనక్కిలాగే ప్రతికూల పరిస్థితులు. వీటి మధ్య కొంతకాలం సంఘర్షణకు గురైన. చావోరేవో ఎట్లయితే అట్లైందని బాపుకు నచ్చజెప్పి ఆత్మవిశ్వాసంతో ముందుడుగువేసిన. రాజ్యాధికారంలో ప్రాతినిధ్యంలేని నా కులానికి ప్రాతినిధ్యం వహించే మొదటి వ్యక్తిని కావాలనుకున్నా. అవకాశాలను సద్వినియోగం చేసుకున్నా. ఈక్రమంలోనే అన్నీ సానుకూలతలు గల బలమైన నాయకుడితోనే మొదటిసారి తలపడ్డ. అప్పటికే రాజ్యాధికారానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న, వేల ఎకరాల భూస్వామి మాదాడి నర్సింహారెడ్డిలాంటి నేతను ఓడించి రాజకీయాల్లో నిలబడ్డ. నాకంటే కష్టపడ్డోల్లు ఉండొచ్చు. వాళ్లకు రాని గుర్తింపు, గౌరవం నాకొచ్చిందంటే అది నా అదృష్టం. దానికి కారణం ఎన్టీఆర్, కేసీఆర్. వీళ్లద్దరి సహచర్యంతో ప్రతికూలతలన్నింటినీ అధిగమించా..." అని అంటున్నారు తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్, ప్రస్తుత శాసన మండలిలో బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి. విలక్షణ నేతగా, అజాత శత్రువుగా, అందరివాడుగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన చెరగని ముద్ర వేసుకున్న మధుసూదనాచారి అక్షరదర్బార్‌తో తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. కుటుంబ నేపథ్యం, తన రాజకీయ ప్రస్థానం, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై నిర్వహించిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయాలు పంచుకున్నారు. అవి ఆయన మాటల్లోనే..

– అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- లోపలి పేజీల్లో

- రికార్డుల్లో తనపేరుండటం కాదు, తనపేరునే రికార్డులెన్నో..
- పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజల వెంటే..
- ఎన్టీఆర్, కేసీఆర్ ఇద్దరూ అత్యంత సన్నిహితులు
- వీళ్లద్దరి సహచర్యంతో ప్రతికూలతలన్నింటినీ అధిగమించిన
- మండలిలో బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి

అక్షరదర్బార్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ

ముందస్తు చర్యలతో నేరాల అదుపు

- తగ్గిన హత్యలు, నేరాలు, మోసాలు, రోడ్డు ప్రమాదాలు
- రూ.12.81 కోట్ల చోరీ సొత్తు స్వాధీనం
- ఏడాదిలో 772 సైబర్ నేరాల కేసుల నమోదు
- వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- పోలీస్ కమిషనరేట్ 2024 క్రైమ్ రౌండప్ వెల్లడి

క్రైం రిపోర్టును ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా, పోలీస్ ఉన్నతాధికారులు

అక్షరదర్బార్, హనుమకొండ: పోలీసులు తీసుకున్న ముందస్తు చర్యలతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది నేరాలు అదుపులో ఉండటంతో పాటు తగ్గు ముఖం పట్టాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ 2024 సంబంధించి క్రైమ్ రౌండప్ మీడియా సమావేశాన్ని శనివారం ఆయన కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ కమిషనరేట్ పోలీసులు ముందస్తు ప్రణాళికలు, సమాచారంతో నేరాలను పూర్తి స్థాయిలో నియంత్రించడం జరిగిందని, ముఖ్యంగా పోలీసులు నేరాలను కట్టడి చేయడంతో పాటు, నేరస్తులను పట్టుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా మారిందని చెప్పారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గత ఏడాదితో పాటు ప్రస్తుత ఏడాది జరిగిన నేరాలకు వ్యత్యాసాలను వివరించారు. ఇందులో ప్రధానంగా ప్రస్తుత సంవత్సరం 14,406 కేసులు నమోదవగా గత ఏడాది కంటే ఇవి 3.21 శాతం తక్కువని, గత సంవత్సరం గణాంకాలు అధారంగా చేసుకొని ప్రస్తుత సంవత్సరంలో హత్యలు 16.67 శాతం తగ్గాయని, ఆస్తినేరాలకు సంబంధించి స్వల్పంగా 2.23 శాతం తగ్గడంతో పాటు రూ.11.81 కోట్ల విలువ గల చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

తగ్గిన నేరాలు, మోసాలు

వరంగల్ కమిషనరేట్ పోలీసులు వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది అంతరాష్ట్ర దొంగలను అరెస్టు చేయడం జరిగిందని, మహిళలపై నేరాలకు సంబంధించి 11 శాతం, మోసాలు 16 శాతం, అపరహణ 7.45 శాతం చొప్పున గత సంవత్సరం కన్నా తక్కువ కేసులు నమోదయినాయని సీపీ చెప్పారు. అలాగే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలను నివారించడంలో కమిషనరేట్ పోలీసులు విజయం సాధించారని, ఇందులో గతేడాది 1558 రోడ్డు ప్రమాదాలు జరగగా, ప్రస్తుత సంవత్సరంలో 1434 రోడ్డు ప్రమాదాల కేసులు నమోదయ్యాయని, రోడ్డు ప్రమాదాల్లో గత సంవత్సరం 499 మంది మరణించగా, ఈ ఏడాది 417 మంది మరణించారని తెలిపారు. గత సంవత్సరం కన్నా 12.30 శాతం తక్కువగా రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవించే మరణాలు తగ్గించబడ్డాయని, సైబర్ నేరాలకు సంబంధించి 772 కేసులు నమోదు కావడంతో పాటు సైబర్ నేరాగాళ్ల నుంచి సుమారు రూ.1.30 కోట్లను తిరిగి స్వాధీనం చేసుకోబడిందని అంబర్ కిషోర్ ఝా ప్రకటించారు.

రూ.2.63 కోట్ల గంజాయి స్వాధీనం

మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసులు తీసుకున్న చర్యల్లో భాగంగా 147 కేసుల్లో సుమారు రూ.2.63 కోట్ల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు 321మంది నేరస్తులు అరెస్టు కాబడ్డారనీ సీపీ తెలిపారు. నేరాలకు సంబంధించి పోలీసులు నైపుణ్యంతో కూడిన దర్యాప్తు చేయడంతో పాటు తగిన సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించడంతో 2462 మందిపై నేరాలు నిరూపణ కావడంతో శిక్షలు విధించబడ్డాయని చెప్పారు. ఇది గతేడాది కంటే 42 శాతం ఎక్కువగా నమోదయిందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఏఎస్పీ మనాన్ భత్, అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్ రెడ్డి, డేవిడ్‌రాజు, ఇన్ స్పెక్టర్లు శ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్

ఇందిరమ్మ పాలనలోనే ప్రజా సంక్షేమం

అక్షర దర్బార్, నర్సంపేట : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని నర్సంపేట పట్టణ 16వ వార్డు ఇన్చార్జి బాణాల శ్రీనివాసు అన్నారు. శనివారం నర్సంపేట పట్టణంలోని 16వ వార్డులో రూ.1.65 కోట్ల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ గండి గిరి, తాళ్లపెల్లి శ్రీనివాస్, కేతావతుల వెంకన్న, కేతావతుల నాగేశ్వర రావు, అక్బర్, వంగ కోటి, మారెల్లి రాకేష్, కొప్పు గాంధీ, మదాసీ కృష్ణ,బాణాల భాస్కర్,మొలుగురి ఎలిష,రామగిరి రాజు,సముద్రాల రాజు,వెంకన్న పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

పంటల సంరక్షణకు మెలకువలు పాటించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదాదేవి
- మాదన్నపేటలో పంటల పరిశీలన
- రైతు వేదికలో పంటల సంరక్షణపై రైతులకు అవగాహన సదస్సు

అక్షర దర్బార్, నర్సంపేట : రైతులు వాణిజ్య పంటలతో పాటు ఉద్యానవన పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కలెక్టర్ సత్య శారదా దేవి సూచించారు. శనివారం నర్సంపేట రూరల్ మండలం మాదన్నపేట గ్రామంలోని రైతు వేదికలో శనివారం వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవనాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మిరప పంటలో కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటల సాగుతో పాటు సాధించిన పంటల దిగుబడిని వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకు రక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డిఓ రమాదేవి, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి నిర్మల, మార్కెటింగ్ ఆధికారి సురేఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పూర్వ వీఆర్వోలు

తహసీల్దార్లను సన్మానించిన పూర్వ వీఆర్వోలు

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్, ఐనవోలు తాసిల్దార్లు మహ్మద్ ఇక్బాల్, కె విక్రమ్ కుమార్ లను వరంగల్ ఎమ్మార్వో కార్యాలయంలో పూర్వ వీఆర్వోల వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ వీఆర్వోల వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు సీహెచ్ వేణు మాట్లాడుతూ గత బీఆరెస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారని, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంపై ఒత్తిడి చేసి పూర్వ వీఆర్వోలను విధుల్లోకి తీసుకునేందుకు విశేష కృషి చేసిన టీజీటిఏ రాష్ట్ర అధ్యక్షుడు వరంగల్ ఎమ్మార్వో మహ్మద్ ఇక్బాల్, ఐనవోలు ఎమ్మార్వో విక్రమ్ కుమార్ లను ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ వీఆర్వోల వరంగల్ జిల్లా కమిటీ జనరల్ సెక్రటరీ హరిప్రసాద్, ఉపాధ్యక్షులు గోపీసింగ్, శ్రావణ్, సభ్యులు రాంప్రసాద్, మహేందర్,గద్దల రాజు, రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపు ప్రారంభం

అక్షర దర్బార్, పరకాల : పరకాల 20వ వార్డులో ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపును పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ సోదా అనిత రామకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరకాల పట్టణ ప్రజలు ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కౌన్సిలర్ ఏకు రాజు, మాజీ ఎంపీపీ ఎన్కతల్ల రవీందర్, స్పెషలిస్ట్ డాక్టర్లు తిప్పని అవినాష్, మద్ది నారాయన్, తిప్పని సువిత్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొచ్చు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సోదా రామకృష్ణ

అనుకున్నా సాధించా

కుల బలంలేదు. ధన బలంలేదు, సామాజికంగా రాజకీయ నేపథ్యం అంతకన్నాలేదు. ఇలాంటి పూర్తి ప్రతికూలతల్లోనే పాలిటిక్స్‌లో అడుగుపెట్టిన. ఓపక్క మనకు రాజకీయాలొద్దు బిడ్డా అని వారించిన నాన్న, మరోపక్క నిత్యం వెనక్కిలాగే ప్రతికూల పరిస్థితులు. వీటి మధ్య కొంతకాలం సంఘర్షణకు గురైన. చావోరేవో ఎట్లయితే అట్లైందని బాపుకు నచ్చజెప్పి ఆత్మవిశ్వాసంతో ముందుడుగువేసిన. రాజ్యాధికారంలో ప్రాతినిధ్యంలేని నా కులానికి ప్రాతినిధ్యం వహించే మొదటి వ్యక్తిని కావాలనుకున్నా. అవకాశాలను సద్వినియోగం చేసుకున్నా. ఈక్రమంలోనే అన్నీ సానుకూలతలు గల బలమైన నాయకుడితోనే మొదటిసారి తలపడ్డ. అప్పటికే రాజ్యాధికారానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న, వేల ఎకరాల భూస్వామి మాదాడి నర్సింహారెడ్డిలాంటి నేతను ఓడించి రాజకీయాల్లో నిలబడ్డ. నాకంటే కష్టపడ్డోల్లు ఉండొచ్చు. వాళ్లకు రాని గుర్తింపు, గౌరవం నాకొచ్చిందంటే అది నా అదృష్టం. దానికి కారణం ఎన్టీఆర్, కేసీఆర్. వీళ్లద్దరి సహచర్యంతో ప్రతికూలతలన్నింటినీ అధిగమించా... అని అంటున్నారు తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్, ప్రస్తుత శాసన మండలిలో బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి. విలక్షణ నేతగా, అజాత శత్రువుగా, అందరివాడుగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన చెరగని ముద్ర వేసుకున్న మధుసూదనాచారి అక్షరదర్బార్‌తో తన అంతరంగాన్ని ఆవిష్కరించ ారు. కుటుంబ నేపథ్యం, తన రాజకీయ ప్రస్థానం, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై నిర్వహించిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయాలు పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

– అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజల వెంటే..
- ఎన్టీఆర్, కేసీఆర్ ఇద్దరూ అత్యంత సన్నిహితులు
- వీళ్లద్దరి సహచర్యంతో ప్రతికూలతలన్నింటినీ అధిగమించిన
- మండలిలో బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి
- అక్షరదర్బార్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ

- నాన్నను ఒప్పించి, మెప్పించా..
- ప్రాతినిధ్యంలేని కులానికి నాయకత్వం వహించా..
- రాజ్యాధికారానికి దూరంగా ఉన్న కమ్యూనిటీ నుంచి లీడర్‌గా ఎదిగిన
- రికార్డుల్లో తనపేరుండటం కాదు, తనపేరునే రికార్డులెన్నో...

మొదట్లో ఆర్ఎస్‌యూ సానుభూతిపరుడిని..

మాది హన్మకొండ జిల్లా నడికూడ మండలం నర్సక్కపల్లె. అమ్మా నాన్న, నలుగురు అన్నదమ్ము లం, ఓ చెల్లె. విశ్వబ్రాహ్మ ణ కుల వృత్తిపైనే ఆదారపడిన నాన్న కష్టపడి మా ఐదుగురిని ఆ రోజుల్లోనే హైదరాబాద్‌లో ఉన్నతంగా చదివించారు. ఊళ్లోని గొప్ప కులాలతో పోటీపడి పోటీపడి ఏ లోటు లేకుండా పెంచారు. ఎంఏ ఇంగ్లీష్, పర్సనల్ మేనేజ్‌మెంట్ డిప్లొమా చేసిన తర్వాత లా డిస్‌కంటిన్యూ చేశా. చదువుకునే రోజుల్లో నేను మొదట ఆర్ఎస్‌యూ సానుభూతిపరుడిగా ఉన్న. అందులోనే యాక్టివ్‌గా పనిచేయాలని అనుకున్నప్పటికీ నాన్న సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చిండు. దీంతో నిర్ణయం మార్చుకున్నా. ఎన్టీఆర్ అంటే అభిమానం. ఆ అభిమానంతోనే ఆయన టీడీపీ స్థాపించినప్పుడు 1982లో 25 ఏండ్ల వయస్సులో రాజకీయాల్లోకి రావాలనుకున్నా. వద్దు బిడ్డా.. రిస్క్ ఎందుకు ? మనకు కుల, ధనబలం లేదని నాన్న వారించిండు. ఎలాగైనా ఎమ్మె ల్యే కావాలన్న గట్టి పట్టుదలతో నాన్నకు నచ్చజెప్పి రాజకీయాల్లోకి వచ్చిన. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ పిలిచి కార్పొరేషన్ పదవి ఇస్తానంటే దండంపెట్టి వద్దన్నా. తన టార్గెట్ ఎమ్మె ల్యే పెద్దాయనకు చెప్పిన. ఆతర్వాత ప్రజల అండ, ఎన్టీఆర్ ఆశీస్సులతో 1994లో తొలిసారి శాయంపేట నుంచి ఎమ్మె ల్యేగా గెలుపొందిన. ఆ క్షణంలో అమ్మా నాన్న కళ్లల్లో చూసిన ఆనందం ఇప్పటికీ మరువలేను.



అనేక రికార్డులు

రాష్ట్రంలో జిల్లాల ఏర్పాటు అంశం తెరపైకి వచ్చినప్పుడు భూపాలపల్లి కనీసం గ్రామపంచాయతీ కూడా కాదు. అలాంటి వెనుకబడిన మారుమూల భూపాలపల్లిని జిల్లాగా మార్చిన. చిట్యాల ప్రభుత్వ దవాఖానలో పడకలను 30 నుంచి 50కు పెంచిన. మారుమూల మొగుళ్లపల్లి రెసిడెన్షియల్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దిన. రామప్ప–పాకాల చెరువులు కలుపుతూ కెనాల్ ఆధునీకరించిన. టేకుమట్ల గ్రామాన్ని మండలంగా ఏర్పాటుచేసిన. భూపాలపల్లి నియోజకవర్గంలో 40 ముదిరాజ్ కమ్యూనిటీ హాళ్లు నిర్మించిన. ఊరూరా బస్ షల్టర్‌తోపాటు 45 కొత్త గ్రామ పంచాయితీలు ఏర్పాటుచేయించిన. శాయంపేట మండలంలో కొప్పుల బ్రిడ్జి నిర్మించిన. డీబీఎం 38 కాలువను పునరుద్ధరించా. ప్రతి ఊరికి సీసీ రోడ్డు, అభివృద్ధి కోసం రూ. 10 లక్షలు మంజూరుచేయించిన. నాగరికతకు దూరంగా ఉన్న చెంచులు, కోతులోల్లకు ప్రత్యేక కాలనీలు ఏర్పాటుచేశా. అంతేగాక ప్రత్యేక బస్సుల్లో వీరందరినీ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ చారిత్రక ప్రదేశాలు చూపించా. ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు వీక్షించేలా ఏర్పాట్లు చేశా.

ఆయనకు సరితూగే నేతలెవరూ లేరు..

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కేసీఆర్‌కు సరితూగే నేతలెవరూ ఇతర పార్టీల్లో లేరు. పీకేయడానికి బీఆర్ఎస్ పార్టీ మొక్క కాదు, అది శాఖోపశాఖలుగా వేలూనుకున్న మహా వృక్షం. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మరించి పాలన సాగిస్తోంది. కొంతకాలం ప్రభుత్వానికి సమయం ఇవ్వాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఉన్నారు. సరైన సమయంలో బయటకు వస్తారు.

ఎన్టీఆర్, కేసీఆర్ ఇద్దరికీ పోటీ లేదు

తన రాజకీయ జీవితంలో అనేక మంది ముఖ్యమంత్రులను దగ్గరగా గమనించిన. అదృష్టం కొద్ది సొంతంగా పార్టీలు పెట్టుకొని ముఖ్యమంత్రులైన ఇద్దరు ఎన్‌టీఆర్, కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలిగిన. వాళ్లిద్దరి ఆశీస్సులతోనే ఎవరూ తుడిచిపెట్టలేని అనేక రికార్డులు నెలకొల్పిన. కేసీఆర్ బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడైతే.. నేను వ్యవస్థాపక జనరల్ సెక్రటరీగా ఉన్న. తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఆయన పనిచేస్తే, స్పీకర్‌గా నేను సేవలందించిన. ఇప్పుడు శాసనసభలో కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటే.. నేను శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపడుతున్నా. ఇలాంటి అవకాశం, అదృష్టం అందరికీ రాదు. 1987 నుంచి ఈ రోజు వరకు పదవిలో ఉన్నా, లేకున్నా రాష్ట్ర రాజకీయాల్లో నా ఐడెంటిటీ కాపాడుకుంటున్నా. ఈ సుదీర్ఘ ప్రయాణంలో కొందరు నాయకులు నమ్మి ంచి మోసం చేసినా, ప్రజలు మాత్రం చారిసాబ్‌ను తమ గుండెల్లో పెట్టుకున్నరు. వాళ్ల అభిమానం, ప్రేమ ముందు పదవులు కూడా చిన్నవే.. హైదరాబాద్‌లో చారిసాబ్‌గా, పాతతరం మధన్నగా, భూపాలపల్లి ప్రజలు స్పీకర్ సార్‌గా పిలుచుకుంటున్నారంటే వాళ్ల అభిమానమే.

నెల రోజులు సంఘర్షణ..

పాలిటిక్స్‌లోకి వచ్చే ముందు నాకు నేను ప్రశ్న వేసుకున్న. భారతదేశంలో రాజ్యాధికారం విభజన ఎట్ల జరుగుతోంది ? దీనికి సమాధానం దొరకడానికి నెలరోజులు పట్టింది. మొత్తం 5 రకాల విభజనను గమనించిన. 1. అప్పటి వరకు రాజులు, సామంతులు, భూస్వాములుగా ఉన్నవాళ్లంతా నాయకులై సుభిక్షంగా ఉన్నరు. 2. మహానుబావుడు బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం వల్ల కొంత షేర్ అనుభవిస్తున్న కులాలు కొన్ని. 3. అధికారంలో ఉన్నవాళ్లకు మాటలు చెప్పి వాటా తీసుకునే కులాలు ఇంకొన్ని. 4. సంఖ్యాపరంగా తక్కువ ఐనప్పటికీ, బెదిరించి పదవులు అనుభవించే కులాలు కొన్ని. 5. ఎన్నికలు రాగానే బల ప్రదర్శన చేసి సీట్లు పొందేవి మరికొన్ని. ఈ ఐదింటిలో అస్సలు తెరపైకి రాని కులాలు కొన్ని ఉన్నయ్. అందులో మా విశ్వబ్రాహ్మ ణ కులం ఒకటి. అప్పటి వరకు మేం ఓటర్లం మాత్రమే. రాజ్యాధికారంలో మా ఐడెంటిటీ లేదు. కాబట్టి నేను బలంగా నిర్ణయించుకున్నా రాజకీయాల్లోకి రావాలని. ప్రాతినిధ్యం ఉన్న ఏ కులం నుంచి ఎదిగినా ఆ కులానికి, ఆ కుటుంబానికి అది పాతదే అవుతది. కానీ, అప్పటి వరకు రాజ్యాధికారంలో ప్రాతినిధ్యంలేని నా కులానికి ప్రాతినిధ్యం వహించే మొదటి వ్యక్తిని కావాలనుకున్నా. అవకాశాలను సద్వినియోగం చేసుకున్నా.

అవినీతి తిమింగలాలు

- ప్రతి పనికీ రేట్ ఫిక్స్ చేసి మరీ వసూళ్లు
- వరుసగా దాడులు జరుగుతున్నా మారని తీరు
- తాజాగా ఏసీబీ వలలో ఇద్దరు అధికారులు
- రూ. 6వేలు తీసుకుంటూ పట్టుబడిన శంకరపట్నం డీటీ
- రూ. 50 వేలు పుచ్చుకుంటూ అడ్డంగా బుక్కైన దమ్మపేట రెవెన్యూ సర్వేయర్

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన దమ్మపేట రెవెన్యూ సర్వేయర్

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: వరుసగా ఏసీబీ దాడులు జరుగుతున్నా పలు శాఖల్లోని అధికారుల తీరులో మాత్రం మార్పు రావడంలేదు. కొందరు ఆఫీసర్లు లంచమిస్తేనే పని చేస్తున్నారు. ప్రతి పనికీ ఇంత అని ఫిక్స్ చేసి మరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ భూరికార్డులు, వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ శాఖల్లో ఎంతో కొంత ముట్టజెప్పనిదే పనులు జరగని పరిస్థితి నెలకొన్నది. మరోవైపు లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని, అవినీతికి పాల్పడితే కటకటాలు తప్పవని, ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఫోన్ నంబర్ 94404 46140 ను సంప్రదించాలని అవినీతి నిరోధకశాఖ అధికారులు సూచిస్తున్నారు.

శంకరపట్నం డీటీ..

రెవెన్యూశాఖలో మరో అవినీతి చేప ఏసీబీ అధికారులకు చిక్కింది. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల డిప్యూటీ తహశీల్దార్ మల్లేశం రూ. 6వేల లంచం తీసుకుంటుడగా శనివారం ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఓ వ్యక్తి దగ్గర నుంచి నాలా కన్వర్షన్ కోసం అనుమతులు కోరగా, డీటీ మల్లేశం లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితులు చేసేది ఏమీ లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు డిప్యూటీ తహసిల్దార్ మల్లేశం రూ. 6 వేలు లంచం తీసుకుంటుండగా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీటీని అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నారు.

దమ్మపేట రెవెన్యూ సర్వేయర్..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట రెవెన్యూ కార్యాలయం మరోమారు వార్తల్లో నిలిచింది. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సర్వేయర్ వెంకటరత్నం రైతుల నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. సర్వేయర్ వెంకటరత్నంను తహసీల్దార్ కార్యాలయంలో విచారించి ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో..

వికారాబాద్ జిల్లా తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు కలకలం సృష్టించాయి. సోమవారంరాత్రి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దాడులు నిర్వహించి రూ. 5 లక్షల లంచం తీసుకుంటున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

హుజురాబాద్ ఆర్డీవో ఆఫీస్ లో..

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో క్లర్క్ సందీప్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ వీడియో సోషల్‌మ◌ీడియా లో చక్కర్లు కొట్టింది. నాలా మార్పిడికి అధికారికంగా సహాయం చేసేందుకు ఒక రైతు నుండి సందీప్ రూ. 75,000 లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు వలపన్ని పట్టుకున్నారు. అరెస్టు చేసిన అధికారిని కోర్టులో హాజరుపరిచారు.

బ్రెయిన్ స్ట్రోక్ తో కాంగ్రెస్ నేత రవి మృతి

అక్షర దర్బార్, తొర్రూరు : తొర్రూరు పట్టణ 1వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రాంపల్లి రవి బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందాడు. రవి స్వగ్రామం ఏడునూతులకు సొంత పనిపై వెళ్లాడు. ఈక్రమంలో బ్రెయిన్ స్ట్రోక్ కు గురి కాగా, కుటుంబ సభ్యులు హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె సహస్ర ఉన్నారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ గౌడ్ తదితరులు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పురుగు మందులను ఆవిష్కరిస్తున్న జీవన్ కుమార్

పురుగు మందులను ఆవిష్కరించిన జీవన్ కుమార్

అక్షర దర్బార్, పరకాల : వరంగల్ నవత ఆగ్రో కెమికల్స్ ఆధ్వర్యంలో జీఎస్పీ క్రాప్ సైన్స్ లిమిటెడ్ నూతన ఉత్పాదనలను జోనల్ మేనేజర్ జీవన్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కీటక నాశనం కోసం ఫైటర్ అనే మందును, తెగుళ్ల నివారణకు ట్రూ స్టార్ అనే మందును లాంచ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నవత ఆగ్రో కెమికల్స్ నుండి మహంత్, సరస్వతి ఆగ్రో కెమికల్స్ నుండి రమేష్, సర్వేశ్వర నుండి అశోక్, దయాకర్, విమల్ రాజు, టి ఎం అంజిబాబు, ఎం ఎం వీరభద్ర పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న చిట్యాల తిరుపతిరెడ్డి

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

అక్షర దర్బార్, నల్లబెల్లి : మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లబెల్లి మండల అధ్యక్షులు చిట్యాల తిరుపతి రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మాలోత్ రమేష్ నల్లబెల్లి మండలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాలఅశోక్ ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి యూత్ కాంగ్రెస్ మండలంఅధ్యక్షులు పురషోత్తం సురేష్ మండల కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ మాలోత్ మోహన్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ చరణ్ సింగ్ నల్లబెల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని మహేష్ రుద్రగూడెం అధ్యక్షులు అజ్మీరా తిరుపతి నందిగామ అధ్యక్షులు జంగిలి మోహన్ నారక్కపేట గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ పోగుల కుమారస్వామి బీసీ సెల్ మండల వైస్ ప్రెసిడెంట్ వైనాలపవన్ మాజీ ఎంపీటీసీ మాలోత్ ప్రతాప్ సింగ్ తిప్పని లింగమూర్తి కన్నీబోయిన సురేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
- రాజీవ్ స్వగృహ, ఇందిరమ్మ కాలనీల సందర్శన

అక్షరదర్బార్, హనుమకొండ : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి కడిపికొండలోని రాజీవ్ స్వగృహ, ఇందిరమ్మ ఇండ్ల కాలనీని సందర్శించారు. ఈసందర్భంగా సమస్యలను పరిష్కరించాలని స్థానికులు నాగరాజును కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ఇక్కడ 16 బ్లాక్‌లు ఉన్నాయని, ప్రతి బ్లాక్ నుంచి ఒకరిని తీసుకొని 16 మందితో కమిటీగా ఏర్పడాలని సూచించారు. ఇండ్లలో ఎంత మంది ఓనర్స్, ఎంతమంది కిరాయివారులు ఉన్నారనే విషయం తెలియజేయాలన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా శానిటేషన్ కోసం ఒక వాహనాన్ని ఏర్పాటు చేస్తామని, అలాగే లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య

కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులు

- మతోన్మాదులు దేశ ద్రోహులు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- వరంగల్ లో ఘనంగా శత జయంతి ర్యాలీ

అక్షరదర్బార్, వరంగల్ : దేశంలో కమ్యూనిస్టులే నిజమైన దేశ భక్తులని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా వరంగల్ నగరంలోని రైల్వే స్టేషను నుండి వరంగల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశంలో మతాలు, కులాల మధ్య విబేధాలు సృష్టిస్తున్న మతోన్మాదులు దేశ ద్రోహులని అన్నారు. సమ సమాజ నిర్మాణమే సీపీఐ ధ్యేయం అన్నారు. అంతరాలు లేని సమాజం కోసం కమ్యూనిస్టుల పోరాటం చేస్తున్నారని అన్నారు. పార్టీ ఆవిర్భవించిన వందేళ్లలో అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు.

ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు

భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించి వేలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. అంతేకాకుండా వరంగల్ జిల్లాలో వేలాది మంది పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత కూడా దక్కిందన్నారు. కార్యక్రమానికి వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షత వహించగా రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా, పనాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుట్ట మధూకర్ పరామర్శ..

అక్షర దర్బార్,మహాదేవపూర్ : మండలంలోని సూరారంలో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి. మహాదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, రాజిరెడ్డి,పెండ్యాల మనోహర్, అలీమ్ ఖాన్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పుట్ట మధుకర్

శనివారం
28.12.2024
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

నాలుగో విడత మాఫీ కాలే

- అధికారుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- అవగాహన కల్పించని వ్యవసాయ శాఖ అధికారులు

అక్షర దర్బార్, శాయంపేట : ఓవైపు వ్యవసాయ శాఖ అధికారులు నాలుగో విడత రుణమాఫీ జాబితాను శాయంపేట మండల రైతులకు విడుదల చేసిన.. మరోవైపు రుణమాఫీ జాబితా రైతుల బ్యాంకు ఖాతాలో జమ కాలేదు.. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సభలో నవంబర్ 30 నాడు నాలుగో విడత రుణమాఫీ జాబితాను విడుదల చేశారు. విడుదల చేసి దాదాపుగా 30 రోజులు గడుస్తున్నా కూడా ఇప్పటివరకు రైతుల ఖాతాలో నగదు జమ రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణమున్న రైతులకు రుణమాఫీ చేశామంటూ చెబుతున్న ఇంకా అసంపూర్తిగానే కనిపిస్తుందని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను నాలుగు విడతల్లో చేపట్టింది. ఇప్పటివరకు మూడు విడతల కింద విడుదల చేసిన నిధులు రైతులకు అందాయి. కానీ నవంబర్ 30న నాలుగో విడత చేసిన రుణమాఫీ డబ్బులు రైతుల అకౌంట్లో జమ కాకపోవడంతో రైతులు శాయంపేట మండల వ్యవసాయ శాఖ అధికారుల మరియు బ్యాంకర్ల చుట్టూ తిరిగినా కూడా అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తప్పులు సవరించినా..

పట్టాదారు రైతు పేరు, ఆధార్ నంబర్లో తప్పుగా ఉండటం, రేషన్ కార్డు లేకపోవడం, ఒకే ఆధార్ నంబర్ ఇద్దరు పేరునా ఉండటం లాంటి కారణాలతో పలువురు రైతులకు ముడతలు రుణమాఫీ నిలిచిపోయింది. వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు సదస్సులు నిర్వహించి తప్పులు సవరించడంతో పాటు ఏవోలు రైతు కుటుంబాల ఫోటోలు తీసి ఆన్లైన్ యాప్ లో అప్లోడ్ చేశారు. వారందరికీ ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నట్లు గత నెల 30 నాడు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన రుణమాఫీ జాబితా రైతుల అకౌంట్లో 4వ విడత రుణమాఫీ జమ కాలేదు. ప్రభుత్వం రుణమాఫీ నిధులు జమ చేస్తే బ్యాంకు అప్పు తీరుతుంది. దీంతో రైతులు తిరిగి మళ్లీ రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ మాఫీతో అప్పు తిరితే కొత్తగా రుణం తీసుకుని వ్యవసాయ పెట్టుబడులకు వినియోగించవచ్చని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్రామాల నుంచి రైతులు ప్రతిరోజు మండల కేంద్రంలో ఉన్న బ్యాంకులకు వెళ్లి రుణమాఫీ నిధులు జమ అయ్యాయా? అధికారులను అడుగుతున్నారు. రైతులు పదే పదే వచ్చి అడుగుతుండడంతో బ్యాంక్ అధికారులు వి సుక్కుంటున్నారు.

రుణమాఫీపై అన్నదాతల చర్చలు

శాయంపేట మండలంలో ఎక్కడ చూసినా పంట రుణాల మాఫీ పైనే రైతులు చర్చించుకోవడం కనిపిస్తుంది రుణమాఫీ జరిగిన రైతుల్లో ఆనందం కనిపిస్తున్న రుణమాఫీ కానీ రైతులు ప్రభుత్వ తీరును తప్పుపడుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.. మిగతా రైతులకు అసలు రుణమాఫీ అవుతుందా..? లేదా...?అనే అనుమానాలు సర్వత్ర వ్యక్తం అవుతుంది.

శాయంపేట ఎస్సైని సన్మానించిన బిజెపి నాయకులు

అక్షర దర్బార్,శాయంపేట : శాయంపేట మండలానికి నూతనంగా వచ్చిన ఎస్సై జక్కుల పరమేష్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసిన బిజేపి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు రాయరాకుల మొగిలి వారి వెంట ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కానుగుల నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ,సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులున్నారు.

కబ్జాకోరల్లో అసైన్డ్ భూములు..!

- పట్టించుకోని అధికారులు,ప్రజాప్రతినిధులు
- మాయమవుతున్న ప్రభుత్వ భూములు
- అడిగేవారు లేక రెచ్చిపోతున్న అక్రమార్కులు
- కబ్జా చేసిన భూముల్లో దర్జాగా నిర్మాణాలు
- చర్యలు తీసుకోవాలని మండల ప్రజల డిమాండ్

అక్షర దర్బార్, కేసముద్రం : అక్రమార్కులకు అడ్డూ అదుపులేకుండా పోయింది. నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోయేందుకు ఆమడదూరంలో ఉండగా అడ్డదారులకు పాల్పడే కేటుగాళ్ల వ్యవహారం ఇప్పుడు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఎప్పుడో చెక్ పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినా నేటికి చర్యలు తీసుకోకుండా కింది స్థాయి అధికారులు చోద్యం చూస్తున్నారు.

దర్జాగా కబ్జా..

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పరిధిలోని కేసముద్రం విలేజ్‌లో ప్రభుత్వ అసైన్డ్ భూములు కబ్జాకు గురవుతున్నాయి. మెయిన్ రోడ్‌కి సమీపంలో ఉన్న భూములను ఆక్రమణదారులు కాజేశారు. ఆఖరికి షోరూమ్‌లు సైతం నెలకొల్పారు. చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా.. పట్టించుకోని పరిస్థితి. ఇది ఇప్పటి సమస్య కాదు.. 2017 ముందు నుంచి ఇదే తంతు కొనసాగుతోంది. అందినకాడికి రాబందుల్లా అసైన్డ్ భూములను కబ్జా చేస్తున్నా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు అందడంతో స్పందించిన తహశీల్దార్ 2021 ఫిబ్రవరి నెలలో కూల్చివేతలకు నోటీసులు ఇచ్చారు. అక్రమ నిర్మాణాలను 5రోజుల్లో నేలమట్టం చేయాలని ఆదేశించారు.

తహసీల్దార్ ఆదేశాలు బేఖాతర్..

తహశీల్దార్ ఉత్తర్వులు జారీ చేసి 4 ఏళ్లు గడుస్తున్నా.. అసైన్డ్ భూములపై రెవెన్యూ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎలాగు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని భావించిన కబ్జాదారులు.. అందినకాడికి కాజేసుకుంటూనే ఉన్నారు. ఈ తంతు ఇలానే కొనసాగిస్తే.. కేసముద్రం మండలం పరిధిలో అసైన్డ్ భూములు మిగలవు అనే ఆరోపణ వినిపిస్తోంది. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కేసముద్రం మండలాన్ని మున్సిపాలిటీ చేస్తామని ప్రకటించారు. మున్సిపాలిటీగా మారే మండల కేంద్రంలో కనీసం అసైన్డ్ భూములను కాపాడుకోలేని దుస్థితి నెలకొంది. అసైన్డ్ భూములు ఉంటే కొత్తగా ఏర్పడే మండల కేంద్రంలో ప్రభుత్వపరమైన కార్యాయాలు నిర్మాణానికి ఆస్కారం ఉంటుంది. అలా కాదని ఇలా కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తే... ఎలా అనే విమర్శ ఉంది. ఇప్పటికైనా.. అధికారులు కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలని రాజకీయపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

మందుబాబులకు భారీ గుడ్ న్యూస్

- ఈ నెల 31న అర్ధరాత్రి వరకు వైన్ షాపులు ఓపెన్
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ

అక్షర దర్బార్, హైదరాబాద్ : న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు ప్రపంచమంతా సిద్ధం అవుతోంది. కొత్త ఏడాదికి గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పేందుకు.. ఈ నెల 31న మందుబాబులు మందేసి చిందేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ సర్కార్ మందుబాబులకు అదిరిపోయే శుభవార్త చెప్పింది. న్యూ ఇయర్ సందర్భంగా 31న రాష్ట్రంలోని వైన్ షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉండనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా రాష్ట్రంలోని పబ్‌లు, బార్లు, రెస్టారెంట్లు న్యూ ఇయర్ సందర్భంగా స్టేట్ గవర్నమెంట్ అనుమతితో నడిచే ఈవెంట్లకు రాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలకు సర్కార్ పర్మిషన్ ఇచ్చింది. ఈవెంట్లలో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మందుబాబులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హాజరైన అధికారులు

ఉపాధి పనులపై ప్రజా వేదిక

అక్షర దర్బార్,మహాదేవపూర్ : ఏప్రిల్ 2023 నుండి మార్చ్ 2024 వరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ఉపాధి హామీ 4,44,67 వేల రూపాయల పనులపై మండలంలో సోషల్ ఆడిట్ నిర్వహించి శనివారం మహాదేవపూర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో 14వ విడత సామాజికతానికి నిర్వహించగా ఇట్టి తనిఖీలో 1లక్ష 14వేల 71 రూపాయలు పనులు అవకతవకలు జరగాయని నిర్ధారించారు. ఇట్టి రూపాయలను వెంటనే రికవరీ చేసేందుకు తనిఖీలలో వచ్చిన అవయోగాలపై సిబ్బందికి త్వరలో జిల్లా కార్యాలయం నుండి నోటీసులు జారీ చేసి అనంతరం శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆడిట్ అధికారులు తెలిపారు. ప్రజా వేదిక ప్రొసీడింగ్ అధికారి నరేష్, జిల్లా విజిలెన్స్ అధికారి రూబీనా, క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరమ్ సింగ్, అంబడ్స్ మెన్ శ్రీనివాస్, రవీంద్రనాథ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ ఏవో రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఇక సెలవు..!

ఆర్థిక సంస్కర్తకు కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్ హాజరు
- తుది వీడ్కోలు పలికిన కాంగ్రెస్ అగ్రనేతలు
- భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించిన మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీ

అక్షరదర్బార్, న్యూఢిల్లీ: భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చివరి మజిలీ ముగిసింది. ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్ లో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. కేంద్ర ప్రభుత్వ అధికారలాంఛనాలతో మన్మోహన్ పార్థివదేహానికి అధికారులు అంత్యక్రియలను పూర్తిచేశారు. అంతిమ సంస్కారాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్ ఖడ్ , ప్రధాని నరేంద్ర మోదీ, భూటాన్ రాజు, లోక్సభ స్పీకర్ ఓంబిర్లా సహా ఇతర కేంద్రమంత్రులు హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్తో పాటు ఆ పార్టీ పాలిత రాష్ట్రాల సీఎంలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మన్మోహన్ పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పుష్పగుచ్ఛం సమర్పించి సెల్యూట్ చేశారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ తో పాటు త్రివిధ దళాధిపతులు మన్మోహన్ భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు. తర్వాత గౌరవ వందనం చేసిన త్రివిధదళాల అధికారులు పేటికపై ఉన్న పూలు, జాతీయ జెండాను తొలగించారు. మన్మోహన్ బంధువులు, మత పెద్దలతో పాటు రాహుల్ గాంధీ పాడే మోస్తూ నిగమ్ బోధ్ ఘాట్ లో చితి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సిక్కు మత సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చితిని పేర్చి పార్థివ దేహాన్ని దహనం చేశారు.

కాంగ్రెస్ నేతల నివాళి

అంతకుముందు ప్రజల సందర్శనార్థం మన్మోహన్ సింగ్ పార్థివదేహాన్ని ఆయన నివాసం నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ మన్మోహన్ సింగ్ భౌతిక కాయానికి కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు నివాళులర్పించారు. అలాగే మన్మోహన్ పార్థివదేహానికి ఆయన భార్య, కుటుంబ సభ్యులు సైతం నివాళులర్పించారు.

జో బైడెన్ సంతాపం

మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. అమెరికా, భారత్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని బైడెన్ కొనియాడారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమేరకు వైట్ హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.

అంతిమయాత్రలో పాల్గొన్న రాహుల్, రేవంత్ రెడ్డి

వీవోఏ సీఏ చేతివాటం..

- కిస్తీ డబ్బులు సొంతానికి వాడుకున్న వైనం
- ఇదేంటని ప్రశ్నించిన సంఘం సభ్యులపై దబాయింపు
- లెక్కలు చేయించడంతో బయటపడిన అవినీతి
- చేసేదేంలేక వాడుకున్న డబ్బులు కట్టేందుకు సుముఖత
- చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల ఆందోళన

అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో శనివారం డ్వాక్రా సంఘాల సీఏ, స్నేహ డ్వాక్రా సంఘం లీడర్ల మధ్య డబ్బుల వివాదం చోటుచేసుకుంది.. ఈ సందర్భంగా పలువరు డ్వాక్రా గ్రూపు సభ్యురాల్లు మాట్లాడుతూ.. సంఘం తరుపున రూ. 10 లక్షలు లోను తీసుకున్నామని, అందుకు ప్రతినెలా కిస్తీల రూపంలో డబ్బులు కడుతున్నామని తెలిపారు. ఈ క్రమంలో కిస్తీ రిసిప్టులు ఇవ్వాలని సీఏను కోరితే దబాయించేదని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బ్యాంకులో తీసుకున్న రుణం ఎంతకూ తీరకపోవడంతో అనుమానం వచ్చి బ్యాంకులో ఆరా తీయగా సీఏ ఆర్థిక మోసం బయటపడిందని వారు పేర్కొన్నారు. దీంతో ఇదేంటని ప్రశ్నించిన సంఘం సభ్యులకు.. మీరే డబ్బులు కట్టలేదని బుకాయించడంతో మోసపోయినట్లుగా తెలుసుకున్న గ్రూప్ సభ్యులు ఆందోళనకు దిగారు. అనంతరం పెద్దమనుషుల సమక్షంలో లెక్కలు చేయించగా రూ. లక్షా 40వేలు సంఘం డబ్బులను సీఏ తన సొంతానికి వాడుకున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో మోసం ఒప్పుకున్న సీఏ చివరికి డబ్బులు కట్టేందుకు ఒప్పుకొని కొంత సమయం తీసుకుంది. మండలంలో ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు.

నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల సభ్యులు

వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్

జైలుకెళ్లినా బుద్ధి మారలె..

- చోరీ కేసులో నిందితుడి అరెస్ట్
- 13 తులాల బంగారం, 40 తులాల వెండి అభరణాలు స్వాధీనం

అక్షరదర్బార్, పాలకుర్తి : ఈనెల 18న రాత్రి పాలకుర్తిలోని చారగుండ్ల మల్లయ్య కాలనీలోని బోడ లలిత ఇంట్లో దొంగతనం చేసిన నిందితుడు మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన కరణం సాయికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు శనివారం పోలీసులు వివరాలు వెల్లడించారు. రాత్రిపూట నిందితుడు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదును దొంగలించుకొని పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పాలకుర్తి పోలీసులు మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జప్తుచేసిన 13 తులాల బంగారం, 40 తులాల వెండి విలువ సుమారు 4,06,000 వుంటుందన్నారు. నిందితుడిపై గతంలో లింగాల ఘనపూర్‌లో రెండు, రాయపర్తిలో ఒకటి , జవహర్ నగర్, కీసర, మేడిపల్లి తదితర పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడి ఈ సంవత్సరం ఫిబ్రవరిలో జైలుకు వెళ్లి సెప్టెంబర్ లో బయటికి వచ్చాడు. తన నేర ప్రవృత్తిని మానక మళ్ళీ పాలకుర్తిలో దొంగతనం చేసి దొరికిపోయాడు. పాలకుర్తి సీఐ మహేందర్, ఎస్ఐ పవన్ కుమార్‌తోపాటు సిబ్బందిని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అభినందించారు.

బీసీల దేశంలో రెండో శ్రేణి పౌరులుగా బీసీలు

అక్షరదర్బార్, హనుమకొండ: బీసీల దేశంలో బీసీలు రెండో శ్రేణి పౌరులుగా జీవించాల్సిన దుస్థితి కొనసాగుతుందని శాసన మండలి బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. హనుమకొండలోని ఏకశిలా పార్క్ ధర్నా చౌక్ వద్ద శనివారం ఆజాది యూత్ ఫెడరేషన్ నిర్వహించిన సత్యాగ్రహ దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ కు మద్దతు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మద్దతు ప్రకటించారు.

రేపు విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం సమావేశం

అక్షరదర్బార్, హనుమకొండ: ఈనెల 29న హనుమకొండలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కళ్యాణ మండపంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించ తలపెట్టినట్లు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోకపోవడం వల్ల విశ్వబ్రాహ్మణులు రోజురోజుకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. పనులు దొరకక విశ్వబ్రాహ్మణులు ఒకవైపు అవస్థలు పడుతుండగా మరోవైపు రాజస్థాన్, బీహార్, ఒరిస్సా వంటి రాష్ట్రాల నుంచి వలస కూలీలు తెలంగాణ రాష్ట్రానికి వచ్చి వడ్రంగు పనులు అతి తక్కువ ధరలకు చేయటం వల్ల విశ్వబ్రాహ్మణులు ఆర్థిక నష్టాలతో ఆకలి చావులకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విశ్వబ్రాహ్మణులకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులపై చర్చించి సమస్యల సాధన కోసం కార్యచరణ రూపొందించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిక్షపతి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, అన్ని జిల్లాల నుంచి సంఘం కార్యవర్గ సభ్యులు, హనుమకొండ జిల్లాలోని సంఘం ప్రతి మండల కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.